‘గృహజ్యోతి’ అమలుకు చర్యలు

- విద్యుత్ మీటర్లకు రేషన్‌కార్డు, ఆధార్ లింక్ చేస్తున్న సిబ్బంది


జడ్చర్లలో రేషన్‌కార్డు, ఆధార్ లింక్ చేస్తున్న సిబ్బంది



జడ్చర్ల టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలుకు చర్యలు చేపట్టింది. అందులో భాగంగా లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియ చేపడుతున్నారు. జడ్చర్ల డివిజన్‌లో 185 మంది సిబ్బంది మీటర్ రీడింగ్‌తోపాటు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు నెంబర్లు లింక్ చేస్తున్నారు. మంగళవారం ఉదయం డివిజన్ కార్యాలయంలో ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ రీడింగ్ మిషన్‌లలో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేశారు. అప్‌లోడ్ చేసుకున్న సిబ్బంది గ్రామాల్లో రీడింగ్ చేయడం ఆరంభించారు. ఈ నేపథ్యంలో సిబ్బందికి ప్రజలు సహకరించాలని విద్యుత్ అధికారులు సూచిస్తున్నారు. కాగా డివిజన్ పరిధిలో ఆఫ్‌లైన్ మిషన్లలో రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అప్‌లోడ్ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. అయితే ఇప్పటికే ఆన్‌లైన్ మిషన్‌లలో మాత్రం ప్రక్రియ ప్రారంభం అయ్యింది. కాగా కొన్ని మండలాల్లో సర్వర్ సమస్య కారణంగా అప్‌లోడ్ ప్రారంభం కాలేదు. బుధవారం నుంచి డివిజన్‌లోని అన్ని మండలాల్లోనూ పూర్తిస్థాయిలో అప్‌లోడ్ చేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. డివిజన్ పరిధిలో జడ్చర్ల, మిడ్జిల్, భూత్పూర్, మూసాపేట, రాజాపూర్, అడ్డాకుల, బాలానగర్, నవాబుపేట మండలాలు ఉన్నాయి. వీటిలో మొత్తం విద్యుత్ కనెక్షన్లు 1.35 లక్షలు ఉండగా.. వ్యాపార, పరిశ్రమల కనెక్షన్లు 55 వేలు ఉన్నాయి. గృహవినియోగ కనెక్షన్లు 85వేలు ఉన్నాయి. వ్యాపార, పరిశ్రమలకు గృహజ్యోతి పథకం వర్తించదు. అదేవిధంగా మొత్తంగా తెల్లరేషన్‌కార్డు లేని వినియోగదారులు 20 శాతం పైగా ఉన్నారు. మిగిలిన వాటికి రేషన్‌కార్డు, ఆధార్‌కార్డులు మీటర్ నెంబరుతో అప్‌లోడ్ చేయడం పది రోజుల్లో పూర్తికానుందని తెలుస్తోంది. తెల్లరేషన్‌కార్డు లేకపోవటంతో చాలామంది సందేహం వ్యక్తం చేస్తున్నారు. తమకు పథకం వర్తించదేమోనని ఆందోళన చెందుతున్నారు. కాగా రేషన్ కార్డు లేనివారికి ఆధార్ మాత్రం అనుసంధానం చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే విషయంపై పూర్తి స్పష్టత రావాల్సి ఉంది.

లబ్ధిదారుల నమోదు

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో మంగళవారం గృహజ్యోతి పథకం కోసం లబ్ధిదారుల నమోదు కార్యక్రమాన్ని జిల్లా విద్యుత్ ఎస్‌ఈ ప్రభాకర్ ప్రారంభించారు. బిల్లింగ్ మీటర్లలో కొత్త సాఫ్ట్‌వేర్ రావడంతో ఇళ్లకు వెళ్లి మీటర్ నంబర్‌తో ఆధార్, తెల్ల రేషన్ కార్డు నంబర్లను అనుసంధానం చేశారు. పట్టణంలో ఎస్‌ఈతో పాటు ఏడీఈ సంతోష్‌కుమార్, ఏఈ సత్యయ్య ఇతర లైన్‌మెన్‌లు, జేఎల్‌ఎమ్‌లు నమోదు చేపట్టారు. దేవరకద్ర టౌన్‌లో 200 మంది వివరాలను నమోదు చేశారు.

సిబ్బందికి సహకరించాలి

మీటర్‌రీడింగ్‌తోపాటు తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు అప్‌లోడ్ చేసి లింక్ చేయమని సిబ్బందిని ఆదేశించాం. ఈ మేరకు రీడింగ్ మిషన్లలో సాఫ్ట్‌వేర్ అప్‌లోడ్ చేశాం. లబ్ధిదారుల ఎంపిక కోసమే వాటిని మీటర్ నంబరుతో లింక్ చేస్తున్నాం. మీటర్ రీడింగ్‌కు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి రేషన్ కార్డు, ఆధార్‌కార్డు ఇవ్వాలి.

-కృష్ణమూర్తి,
డీఈ, విద్యుత్ డివిజన్, జడ్చర్ల

క్లుప్తంగా

వచ్చే నెల 3న పల్స్ పోలియో



పాలమూరు: జిల్లావ్యాప్తంగా వచ్చే నెల 3న అప్పుడే పుట్టిన నవజాత శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు పల్స్ పోలియో టీకాలు ఇవ్వడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కృష్ణ అన్నారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని పాత డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లకు పల్స్ పోలియోపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ భారత్‌ను పోలియో రహిత దేశంగా మార్చడానికి ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్, బస్టాండ్స్, రైల్వే స్టేషన్‌లలో ప్రత్యేక పల్స్ పోలియో పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు తప్పకుండా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. అనంతరం మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు పల్స్ పోలియో చుక్కల మందు పంపిణీ ఎలా చేయాలి.. ఎన్ని చుక్కలు వేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి శంకర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శ్రీధర్‌రెడ్డి, జిల్లా ప్రోగ్రాం అధికారులు శశికాంత్, భాస్కర్‌నాయక్, యూనిసెఫ్ సర్వేలెన్స్ అధికారి అజహర్ పాల్గొన్నారు.

హజ్‌యాత్రికులకు మెడికల్ స్క్రీనింగ్



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో మంగళవారం ఈ ఏడాది హజ్‌యాత్రకు వెళ్తున్న వారికి మెడికల్ హెల్త్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. యాత్రికులకు హెల్త్‌చెకప్ స్క్రీనింగ్ చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు అందజేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిరాజుద్దీన్, డాక్టర్ ముదస్సిర్ హుస్సేన్, డాక్టర్ నజ్మఫాతిమా, డాక్టర్ ముస్తక్‌లు తదితరులు స్క్రీనింగ్ నిర్వహించారు. జిల్లా హజ్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమూద్‌అలీ, ఎండి.మేరాజుద్దీన్, సత్తార్, నిజాముద్దీన్, మహ్మద్ రఫీక్, రజాక్, అహ్మద్ పటేల్, నుస్రత్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సోషల్ ఆడిట్



గండేడ్: మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం మంగళవారం ముగిసింది. రెండు రోజులుగా జరిగిన సమావేశంలో ఈజీఎస్‌లో జరిగిన పనుల్లో అక్రమాలపై నివేదికలు చూసిన డీఆర్‌డీఓ ఏపీడీ జకియా సుల్తానా విచారణ చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి ప్రేమలత, అంబుడ్స్‌మెన్ సంతోష్, ఏపీఓ హరిచంద్రుడు, టీఏలు, ఎఫ్‌ఏలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): విద్యుత్ శాఖలోని మీటర్ రీడర్స్ సమస్యలు పరిష్కరించాలని లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు బాలుగౌడ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రకాష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలో యూనియన్ సమావేశంలో మాట్లాడారు. ఉన్నతాధికారులు మానవతా దృక్పథంతో ఆలోచించి న్యాయం చేయాలన్నారు. నాయకులు రంగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ కుమార్, కోశాధికారి రామలింగం, ఉపాధ్యక్షులు హన్మంతు, ప్రవీణ్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నేడు వినతుల స్వీకరణ

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం 1 గంటల నుంచి 3 గంటల వరకు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించనున్నారు. ఈ మేరకు క్యాంపు కార్యాలయం నుంచి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ప్రజలు ఎమ్మెల్యేకు నేరుగా సమస్యలు తెలుపవచ్చన్నారు. అలాగే మధ్యాహ్నం 3 గంటలకు క్యాంపు కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి, నియోజకవర్గ ఎంఈఓలతో పాటు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలతో రివ్యూ సమావేశం ఉంటుందని తెలిపారు.

దేశవ్యాప్త సమ్మె విజయవంతం చేయాలి



చిన్నచింతకుంట: కేంద్ర ప్రభుత్వం వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతి శీల పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి అరుణ్‌కుమార్ కోరారు. మంగళవారం ఉంద్యాలలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. వెంకటేష్‌గౌడ్, వినోద్, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

పునరుద్ధరించాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: భవన నిర్మాణ కార్మికులకు ప్రభుత్వం మెటర్నిటీ బెనిఫిట్, మ్యారెజ్ క్లెమ్, గిఫ్ట్ దరఖాస్తులు చేసుకునేందు కోసం ఉన్న వెబ్‌సైట్ సర్వర్‌లు కొంత కాలంగా సరిగా పనిచేయడం లేదని.... పునరుద్ధరించాలని నాయకులు అన్నారు. ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ కార్మిక శాఖ కమిషనర్‌కు వినతిపత్రం మంగళవారం అందజేశారు. సూర్యం, సాంబశివుడు, దేవదానం, గణేష్, బాలు, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేష్


చిన్నచింతకుంటలో..

చిన్నచింతకుంట: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పారిశుద్ధ్య వారోత్సవాలు నిర్వహించనుందని.. అధికారులు, తదితరులు విధిగా హాజరై విజయవంతం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు సూచించారు. మంగళవారం చిన్నచింతకుంటలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 14 వరకు వారోత్సవాలు ఉంటాయన్నారు. ఎంపీఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: మండల స్పెషల్ అధికారి సురేందర్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్ మంగళవారం స్పెషల్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మల్లికార్జున్ రావు, ఏఓ కృష్ణకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని.. ప్రత్యేకాధికారులు, కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి వెంకటేష్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, ప్రత్యేకాధికారులు, పంచాయతి కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజునాయక్, ఎంపీడీఓ సాయిలక్ష్మి, ఎంపీఓ అనురాధ, ఎంపీటీసీలు, గౌస్, రాజారెడ్డి, నర్సింహ, ఏఓ సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన దాసరి రాములు ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడగా కాంగ్రెస్ నాయకులు మంగళవారం పరామర్శించారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి సూచనతో వైద్య ఖర్చుల కోసం రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా అడ్డాకులకు చెందిన నరేందర్ ఆర్మీ ఎడ్యుకేషన్ కోసం రూ.10వేల నగదును అందజేశారు. మండలాధ్యక్షుడు శ్రీహరి, విజయమోహన్ రెడ్డి, సయ్యద్‌షఫీ, శరత్‌కుమార్‌రెడ్డి, రాములు, దశరథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వెంకట్ రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్ నిరసన



దేవరకద్ర: పట్టణంలో మంగళవారం బీఆర్‌ఎస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వాఖ్యలకు నిరసనగా కొత్త బస్టాండ్ చౌరస్తాలో నినాదాలు చేశారు. మండల అధ్యక్షుడు నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి, బాల్‌రాజు, రాందాసు, చల్మారెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి


కారుకొండలో మాట్లాడుతున్న డీఈఓ రవీందర్


విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేస్తున్న బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిర


జడ్చర్లలో సమీక్షలో పాల్గొన్న హెచ్‌ఎంలు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎస్సెస్సీ విద్యార్థులు పరీక్షలకు మరింత సమయం ఉన్న నేపథ్యంలో సమయాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ రవీందర్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని ఆర్వీఎం సమావేశ మందిరంలో బీసీ సంక్షేమశాఖ హాస్టల్స్‌లో చదువుతున్న ఎస్సెస్సీ విద్యార్థులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు చదవాల్సిన సబ్జెక్టులను ప్రణాళిక బద్ధంగా రూపొందించుకుని చదవాలని, ప్రత్యేక సమయం కేటాయించి చదవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు బీసీ సంక్షేమశాఖ అధికారిణి ఇందిరా పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ హాస్టల్స్ వార్డెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి

నవాబుపేట: విద్యార్థులకు పాఠాలను నూతన విధానాలతో బోధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, కారుకొండ పాఠశాలలను తనిఖీ చేశారు. బోధన తీరులోని వివిధ రకాల మెలుకువలు వివరించారు. పదో తరగతిలో వందశాతం ఫలితాల సాధనకు కృషిచేయాలని సూచించారు. జీహెచ్‌ఎంలు నాగ్యనాయక్, దశరథ్‌నాయక్ తదితరులు ఉన్నారు.

జడ్చర్ల టౌన్: మిడ్జిల్, జడ్చర్ల మండలాల్లో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా మరింత కృషిచేయాలని జెడ్పీహెచ్‌ఎస్‌ల హెచ్‌ఎంలకు ఎంఈఓ మంజులాదేవి సూచించారు. పట్టణంలో హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. జడ్చర్ల, మిడ్జిల్ నోడల్ అధికారులు జగదీశ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

‘ఉపాధి’ వినియోగించుకోవాలి



అడ్డాకుల: గ్రామాల్లో పని చేసే కూలీలు ఉపాధిహామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఓ యాదయ్య సూచించారు. మండలంలోని బలీదుపల్లి, వర్నె గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. ఉపాధి పనుల్లో కూలీల శాతం పెరిగేలా స్థానిక నాయకులు కృషి చేయాలని కోరారు. బలీదుపల్లి కార్యదర్శి కల్యాణి, వర్నె పంచాయతీ కార్యదర్శి సాజిద్‌పాష రెగ్యులరైజేషన్‌కు రికార్డులను పరిశీలించారు. ఎంపీడీఓ మంజుల, సూపరింటెండెంట్ శివప్రసాద్ ఉన్నారు.

బాలానగర్: గ్రామాల్లో ఉపాధిహామీ కింద పని కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ కృష్ణారావు కార్యదర్శులను ఆదేశించారు. ఇంటిటాక్స్ కలెక్షన్ పై దృష్టి సారించాలని సూచించారు. మంగళవారం జీడిగుట్ట తండా, గుండేడ్ గ్రామాల్లో పర్యటించి స్వచ్ఛతను పరిశీలించారు. అనంతరం రికార్డులు తనిఖీ చేశారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.

బాల్క సుమన్‌పై పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు


హన్వాడలో ఫిర్యాదు చేస్తున్న నాయకులు

సాక్షినెట్‌వర్క్: సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్‌పై కాంగ్రెస్‌నాయకులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు.

జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో దిష్టిబొమ్మ దహనం చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నాయకులు ప్రవీణ్‌కుమార్, రవికిరణ్, రాజుతోపాటు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు అనంతరం.. ముఖ్య కూడలి బాల్క సుమన్ దిష్టిబొమ్మను నాయకులు దహనం చేశారు. నరహరి, గోవర్ధన్‌రెడ్డి, రమణ, యాదయ్య, శ్యామ్‌సుందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

మిడ్జిల్‌లో దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు అల్వాల్‌రెడ్డి, గౌస్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హన్వాడలో నాయకులు విలేకరుల సమావేశంలో బాల్కసుమన్‌పై విరుచుకుపడ్డారు. క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మండల అధ్యక్షుడు కృష్ణయ్య యాదవ్, మాజీ సర్పంచ్ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేటలో దిష్టిబొమ్మ దహనం చేశారు. మండల అధ్యక్షుడు రాంచంద్రయ్య, నవాజ్‌రెడ్డి, నర్సింహ ఉన్నారు.

కరాటేతో ఆత్మరక్షణ



హన్వాడ: మహిళల ఆత్మరక్షణ కోసం కరాటేను నేర్చుకోవాలని జీహెచ్‌ఎం మధులత పేర్కొన్నారు. సల్లోనిపల్లి జెడ్పీఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు కరాటే శిక్షణా తరగతులను నిర్వహించిన సందర్భంగా మంగళవారం చివరిరోజు కార్యక్రమం చేపట్టారు. విద్యార్థినులకు బెల్టులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కరాటే అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి

నవాబుపేట: మండల కేంద్రంలో మంగళవారం సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పరీక్షలు చేసి ఆపరేషన్ అవసరం ఉన్నవారిని జిల్లా కేంద్రానికి తరలించారు. ఫోరం అధ్యక్షుడు నర్సింహులు ప్రతినెలా శిబిరం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా ఉన్న చట్టాలను గౌరవించాలన్నారు. వెంకటేశ్వరప్ప, విజయ్‌కుమార్, స్వామి, పండరీనాథ్, వెంకటయ్య, వేణునాథం, చిన్నయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



భూత్పూర్: మండలంలోని కర్వెన ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.జగన్, యు. మౌనికలు రగ్బీ రాష్ట్రస్థాయి జూనియర్ పోటీల్లో ప్రతిభ కనబర్చినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు మొగులాల్ తెలిపారు. యాదాద్రి జిల్లా కాచారంలో సోమవారం జరిగిన పోటీల్లో విద్యార్థులు బంగారు, కాంస్య పతకాలు సాధించారని వివరించారు. హెచ్‌ఎం రాణి మాలిని దేవి, ఉపాధ్యాయ బృందం తోటి విద్యార్థులు వారిని అభినందించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన



హన్వాడ: వేపూర్‌లో మంగళవారం లోకల్‌బాడీ మీటింగ్ నిర్వహించారు. వైఆర్‌జీకే సంస్థ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గ్రామస్తులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు వ్యాధులపై అవగాహన పెంచుకోవాలని.. తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సంస్థ డీఆర్‌పీ శ్రీకాంత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దీప్తి తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట


మాట్లాడుతున్న పద్మజారెడ్డి

పాలమూరు: దేశ వ్యాప్తంగా మహిళల సంక్షేమం కోసం ప్రధాని పెద్దపీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను అమల్లోకి తెచ్చారని బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి అన్నారు. జిల్లా కార్యాలయంలో పార్లమెంట్ ప్రవాస్ యోజనలో భాగంగా మంగళవారం నిర్వహించిన నారీ శక్తి వందన్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 45లక్షల మహిళ సంఘాల సభ్యులకు ప్రతి గ్రామంలో ప్రత్యేక రుణాలు కల్పించారని తెలిపారు. చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్, మైనార్టీ మహిళలకు ట్రిపుల్ తలాక్ రద్దు అమల్లోకి తెచ్చారన్నారు. జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాస్‌రెడ్డి, మహిళ మోర్చా జిల్లా అధ్యక్షురాలు వేనమ్మ, నారాయణపేట అధ్యక్షురాలు లక్ష్మి, సాహితీరెడ్డి, యాదమ్మ, నిరంజనమ్మ, బాలేశ్వరమ్మ, అంజమ్మ, ప్రసన్న పాల్గొన్నారు.

బీజేపీ ‘గావ్ చలో’


దేవరకద్రలో మాట్లాడుతున్న ప్రశాంత్‌రెడ్డి


జడ్చర్లలో..

సాక్షినెట్‌వర్క్: బీజేపీ ఆధ్వర్యంలో చేపడుతున్న గావ్‌చలో కార్యక్రమంలో ఆయా మండలాల్లో మంగళవారం నిర్వహించారు. హన్వాడ పరిధిలోని టంకరలో గ్రామ ఇన్‌చార్జ్ రఘురాంగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు రైతు సంఘాలు, మహిళా సంఘాలు, ఉపాధిహామీ కూలీలు, యువజన సంఘాలతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. చంద్రయ్య, హన్మంతు, మైబు, సంజీవ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

బస్తీకిపోదాం కార్యక్రమం మంగళవారం జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించారు. ప్రవాసి కార్యకర్తగా జ్యోతి, శాగగోపాల్ పాల్గొని పథకాల గురించి వివరించారు. పట్టణ అధ్యక్షుడు నాగరాజు, నగర అధ్యక్షుడు నరేష్, నాయకులు పాల్గొన్నారు.

దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండ ప్రశాంత్ రెడ్డి మంగళవారం ఆయన నివాసంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకులు దేవన్న, నాగిరెడ్డి, కృష్ణంరాజు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.